నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 29 డిసెంబర్ 2023 | KARIMNAGAR

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఆ దిశగా బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలి
- కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- ఆధైర్యపడొద్దు.. అండగా ఉంటామని భరోసా

మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రసమయి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు

మానకొండూర్, డిసెంబర్ 28 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మానకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ ఆధైర్య పడొద్దని, అందరినీ కడుపులోపెట్టుకుని చూసుకుంటామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్లలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ నియోజకర్గంలో నయాపైసా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ మోసపూరిత, సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిందని, మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోతే కాంగ్రెస్ మాత్రం రాష్ట్రాని ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. వచ్చే నెల 4న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, బీఆర్ఎస్ కేడర్‌కు ఎన్నికలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి గురించి ఆలోచన చేయొద్దని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మానకొండూర్ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, బీఆర్ఎస్ తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు కోండ్ర నిర్మల, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, నెల్లి శంకర్ పాల్గొన్నారు.

ఆర్నకొండలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి దేవసేన, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

సద్వినియోగం చేసుకోవాలి

ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన

కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఆర్నకొండ, చాకుంటలో పర్యటన

చొప్పదండి, డిసెంబర్ 28: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకే ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం ఆర్నకొండ, చాకుంటలో చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. సర్కారు అమలు చేయనున్న ఆరు గ్యారెంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామని చెప్పారు. జనవరి 6వ తేదీ వరకు పనిదినాల్లో గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. ఆర్నకొండ, చాకుంట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన శిబిరాలను ఎస్ఈ గంగాధర్ పరిశీలించారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

రాజన్న సిరిసిల్ల జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 28 : రాష్ట్రం లో కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సూచించారు. ఈ మేరకు గురువారం జిల్లా దవాఖానలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా విలేకరులతో మా ట్లాడుతూ, స్వరాష్ట్రంలోనే వైద్య సేవలపై ప్రజలకు విశ్వాసం ఏర్పడిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే తరహాలో శ్రద్ధ చూపాలని కోరారు. కరోనా కేసులు పెరుగుతున్న క్రమంలో అ వసరమైన కిట్స్, మందులు, బెడ్స్, ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. దవాఖానలోని పలు సమస్యలను వైద్యాధికారులు జడ్పీచైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ మురళీధర్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, జడ్పీటీసీ గుగులోతు కళావతి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు తిప్పలు

- ప్రజా పాలన మొదటి రోజు ప్రజల కష్టాలు
- కొన్నిచోట్ల ప్రారంభంలో అంతంతే.. మరికొన్ని చోట్ల మధ్యాహ్నం వరకు తాకిడి
- పలుచోట్ల అందని దరఖాస్తు పత్రాలు
- జిరాక్స్ సెంటర్ల నుంచి కొనుగోలు
- అర్జీ పూరించడంలో అనేక అనుమానాలు
- అయినా తొలి రోజు 90వేలకుపైగా అర్జీలు

ఉమ్మడి జిల్లాలో మొదటి రోజు వచ్చిన అప్లికేషన్లు

జిల్లా	అప్లికేషన్లు
కరీంనగర్	28,452
జగిత్యాల	30,349
పెద్దపల్లి	24,347
సిరిసిల్ల	11,382
మొత్తం	94,530

కోల్‌సిటీ: 29వ డివిజన్‌లో వార్డు సభలో దరఖాస్తుదారులు

కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం ప్రజాపాలన సభలకు శ్రీకారం చుట్టగా, ఐదు గ్యారెంటీలకు సంబంధించి అప్లికేషన్ ఫాం ప్రజలను తికమకపెట్టింది. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాట్లు చేసినా.. అందుకు తగినట్లు ప్రచారం లేక పోవడం, సభలకు వచ్చిన వారికి సరిపడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేక ఎంతో మంది ఇబ్బంది పడాల్సి వచ్చింది. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకానికి సంబంధించి అన్నింటికీ ఒకే అర్జీ పత్రాన్ని పెట్టగా.. అనేక మందిలో సందేహాలను ముందుంచింది. అంశాల్లో స్పష్టత లేకపోవడంతో అనేక మందిలో అయోమయం వ్యక్తమైంది. అక్కడక్కడా సభలకు జనం అంతంతే రాగా, కొన్ని చోట్ల మాత్రం వేలాదిగా తాకిడి కనిపించింది. పలుచోట్ల ఫారాలు లేక జిరాక్స్ సెంటర్ల నుంచి తెచ్చుకోగా.. మొత్తంగా మొదటి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 94,530 దరఖాస్తు చేసుకున్నట్లు యంత్రాంగం వెల్లడించింది.

కరీంనగర్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా గురువారం నుంచి 'ప్రజా పాలన'కు శ్రీకారం చుట్టింది. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగా ఐదు గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది. వచ్చే నెల 6వ తేదీ వరకు (31, 1వ తేదీ మినహా) ప్రతి రోజూ అర్జీలు స్వీకరించనున్నది. అయితే, 'ప్రజాపాలన' సభలకు మొదటి రోజే బాలారిష్టాలు తప్ప లేదు. దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడొద్దని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించినప్పటికీ అవస్థలు తప్ప లేదు. పలు చోట్ల దరఖాస్తు ఫారాలు అందకనే ఇబ్బందులు పడ్డారు. గ్రామ సభలకు ఒక రోజు ముందే ఫారాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించినా అది జరగ లేదు. ఇదే రోజు దరఖాస్తు ఫారాలతో అధికారులు గ్రామ సభలకు వెళ్లారు. అయితే, అధికారులు వెంట తెచ్చుకున్న దరఖాస్తు ఫారాలు చాలా చోట్ల సరిపోలేదు. దరఖాస్తుల కోసం ప్రజలు ఎగబడ్డారు. జమ్మికుంట వంటి పట్టణంలోనూ అధికారులు 2 వేల దరఖాస్తులు మాత్రమే అందుబాటులో ఉంచారు. దీంతో బస్తీ సభలకు వచ్చిన జనాలకు ఇవీ ఏమాత్రం సరిపోలేదు. అలాగే కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, చామన్‌పల్లి గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి కనిపించింది. బొమ్మకల్‌లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేవని చెప్పడంతో జనాలు నిరాశతో వెనుదిరిగారు. దరఖాస్తులు అందుబాటులో ఎందుకు ఉంచలేదని అధికారులను ప్రశ్నించారు. వచ్చే నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని అధికారులు చెప్పడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. హుజూరాబాద్ మండలం చెల్పూరులో ఇదే పరిస్థితి కనిపించింది. ఈ గ్రామంలో 1,300లకు పైగా నివాస గృహాలు ఉంటే 550 దరఖాస్తు ఫారాలు మాత్రమే అధికారులు అందించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కొందరు జిరాక్స్ కాపీలు అందించినా అందరికీ అందలేదు. తిమ్మాపూర్ మండల కేంద్రంతోపాటు ఇదే గ్రామంలోని రామకృష్ణాకాలనీలో ఇదే పరిస్థితి ఎదురైంది. ఇక్కడైతే ఒక జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు గ్రామ సభ వద్దనే దుకాణం పెట్టేసి దరఖాస్తు ఫారాలు అమ్మాడు. శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నంలోనూ దరఖాస్తుల కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కూడా దరఖాస్తుల కోసం జనం ఎగబడ్డారు. కొన్నిచోట్ల దరఖాస్తులు అందుబాటులో లేక జిరాక్స్ సెంటర్లకు బారులు తీరారు.



కరీంనగర్: ఆరెపల్లిలో దరఖాస్తులు చేసుకుంటున్న ప్రజలు, పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

పర్యవేక్షించిన అధికారులు

ఉదయం 8 గంటలకే గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. షెడ్యూల్ ప్రకారం అధికారులు వెళ్లినా జనాలు సభలకు హాజరు కాలేదు. చాలా చోట్ల జనం కోసం అధికారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం పది పదకొండు గంటల వరకు కాస్త పుంజుకున్నది. జనాలు రావడం, దరఖాస్తులు చేసుకోవడం కనిపించింది. గ్రామ సభల నిర్వహణపై అధికారులు నిత్యం పర్యవేక్షించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామ సభలు జరగ్గా, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పరిశీలించారు. కరీంనగర్‌లో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ కరీంనగర్‌లోని పలు డివిజన్లలో జరిగిన బస్తీ సభల్లో పాల్గొన్నారు. 33వ డివిజన్‌లో మేయర్ సునీల్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ దరఖాస్తు ఫారంలో ఉన్న సందేహాల గురించి అడిగి తెలుసుకున్నారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్‌లో స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

అనేక సందేహాలు

గ్రామసభల్లో దరఖాస్తులు పూరించేందుకు పంచాయతీ సిబ్బంది, గ్రామైక్య సంఘాల నిర్వాహకులను సహాయకులుగా ఉంచారు. దరఖాస్తులు పూరించే సందర్భంలో వారికి సైతం అనేక సందేహాలు వచ్చాయి. మొదట చాలా ఇబ్బంది పడ్డారు. దరఖాస్తు పత్రాలు ఇంటింటికీ పంపిణీ చేస్తామని, పూరించి తేవాలని చెప్పినా మొదటి రోజు అలా జరుగలేదు. పైగా దరఖాస్తులు కూడా సరిపడా అందుబాటులోకి రాలేదు. ఈ విషయం ఇలా ఉంటే దరఖాస్తు ఫారాల్లో ఇచ్చిన ఆప్షన్స్‌లో పలువురు సందేహాలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా ఆర్థిక సహాయం, ₹500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను ఎంచుకునేందుకు ఆప్షన్స్ ఉన్నాయి. దీనికి సంబంధించి దరఖాస్తు ఫారంలో ఒకే ఒక్క కాలమ్ ఇచ్చారు. మిగిలిన ప్రశ్నలు ఏమీ అడుగలేదు. మహాలక్ష్మి పథకం ఎవరెవరికి వర్తింపజేస్తారు? దానికి అర్హతలు ఏంటీ? అన్న వివరాలు ఇవ్వలేదు. ఇక ఒకే రేషన్‌కార్డు కలిగి ఉన్న కుటుంబంలో తల్లీ, ఇద్దరు బిడ్డలు ఉంటే ముగ్గురికి మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం ఇస్తారా..? అత్త కోడలు ఉన్నా వర్తింపజేస్తారా..? అన్న వివరాల్లేవు. అయితే, రైతు భరోసా పథకానికి వచ్చే సరికి చాలా మంది మగవారి పేరిట వస్తున్నది. ఇది ఎలా ఎంపిక చేయాలనే విషయమై దరఖాస్తులో స్పష్టత లేదు. అలాగే రైతు కూలీలకు ఏటా రూ.12వేల ఆర్థిక సాయానికి ఉపాధి హామీ కార్డు నెంబర్ అడిగారు. వాస్తవానికి వ్యవసాయం చేసే రైతు కూలీలు చాలా మంది ఉపాధి హామీ కార్మికులుగా తమ పేర్లను నమోదు చేసుకోలేదు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి కూడా సమగ్రంగా లేదు. ఉద్యమకారుల గురించి కూడా ప్రశ్నలు చిత్రంగా ఉన్నాయి. ఉద్యమంలో ఎంతో మంది పాల్గొన్నప్పటికీ కేసులు నమోదు కాలేదు. కేసులు నమోదు కాకపోతే ఉద్యమకారులుగా గుర్తింపు ఇవ్వరా..? అంటూ దరఖాస్తుదారులు ప్రశ్నించడం కనిపించింది. గృహ జ్యోతికి సంబంధించిన వివరాలు చాలా మందిని అయోమయంలో పడేశాయి. గృహ అవసరాలకు విద్యుత్తు వినియోగం, విద్యుత్ కనెక్షన్ నంబర్‌ను అడిగారు. అయితే దరఖాస్తుదారుల్లో ఇది పెద్ద చిక్కును తెచ్చిపెట్టింది. అద్దెకు ఉంటున్న వారు మీటర్ నంబర్ వేసే పరిస్థితి ఉంటుందా? సొంత ఇంటి దారుడికి మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుందా..? అంటూ ఆరా తీయడం కనిపించింది. అలాగే, చేయూత పథకం కింద దరఖాస్తు చేసుకునే వారికి ఇది వరకే పింఛన్ వస్తున్న వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కానీ, రైతు భరోసా విషయంలో ఇలాంటి సూచన ఏమీ లేక పోవడం, ఇది వరకే రైతు బంధు పొందుతున్న వారు దరఖాస్తు చేసుకోవడమా? లేదా? అనే సందేహాలను గ్రామ సభల్లో చాలా మంది వ్యక్తం చేశారు. వీటికి సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. చాలా మంది అధికారులు మీ ఇష్టం ఉన్నట్లు దరఖాస్తు పూరించండని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఒకేసారి ఐదు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను ఇంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పుడు ప్రజల్లో తలెత్తిన అనుమానాలను నివృత్తి చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్.. లాభాల బాట

- కరీంనగర్ రీజియన్ ముందంజ
- రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత టాప్
- నవంబర్‌లో రూ.77,94,101 లక్షల ఆదాయం
- త్వరలో బార్ కోడ్ స్కాన్ వంటి ఆధునీకరణ సౌకర్యాలు

టీఎస్ ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ లాజిస్టిక్ సెంటర్ లాభాల బాటలో పయనిస్తోంది. ఆదాయంలో హైదరాబాద్ తర్వాతి స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 డిపోల నుంచి లాజిస్టిక్స్ సేవలను కొనసాగిస్తుండగా, నవంబర్ నెలలో రూ.77,94,101ల ఆదాయం సాధించింది.

- తెలంగాణచౌక్, డిసెంబర్ 28



టాప్‌లో కరీంనగర్ సెంటర్

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని లాజిస్టిక్ సెంటర్ టాప్‌లో నిలుస్తున్నది. ఇక్కడి నుంచి ప్రతి రోజూ కరీంనగర్ జిల్లా కేంద్ర నుంచి హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ వంటి వ్యాపార ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాలకు చేరవేసేందుకు వెయ్యి పార్సిల్స్ బుకింగ్ అవుతుంటాయి. వివిధ ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు 800 వరకు పార్సిల్స్ వస్తున్నాయి. ఈ సెంటర్‌లో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయగా, ఒకటి బుకింగ్ పార్సిల్ కోసం, మిగతా మూడు డెలివరీ కోసం పని చేస్తుంటాయి. సేవలు అందించడానికి 12 మంది శాశ్వత సిబ్బంది, మరో 13 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, వస్తువులు దిగుమతి, ఎగుమతి చేయడానికి 45 మంది హమాలీలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రముఖ వస్త్ర వ్యాపారులు, సీడ్స్ కంపెనీలు, విద్యా సంస్థలు, మెడికల్ కాలేజీల నిర్వాహకులు లాజిస్టిక్స్ సేవలను వినియోగించుకుంటున్నారు.

నవంబర్ నెలలో వివిధ డిపోవారీగా పొందిన ఆదాయం

డిపో	ఆదాయం(రూ.లలో)
కరీంనగర్-1	రూ.39,61,927
కరీంనగర్-2	రూ.53,125
హుజూరాబాద్	రూ.3,49,276
హుస్నాబాద్	రూ.1,19,608
జగిత్యాల	రూ.6,83,962
కోరుట్ల	రూ.2,57,373
మెట్‌పల్లి	రూ.2,12,772
గోదావరిఖని	రూ.8,39,404
మంథని	రూ.72,583
సిరిసిల్ల	రూ.11,13,160
వేములవాడ	రూ.1,30,911

కరీంనగర్ బస్టాండ్ అవరణలో లాజిస్టిక్ కార్యాలయం

- ఇక్కడి నుంచి లాజిస్టిక్‌లో హైదరాబాద్‌కు బుక్ అయిన వస్తువును ఆరు గంటల్లో డెలివరీ చేస్తున్నారు. ఇందులో ప్రత్యేకంగా డెలివరీ చేసేందుకు ఫాస్ట్ క్విక్ డెలవరీ(ఎఫ్‌కేడీ) సదుపాయం అందుబాటులో ఉంది. దీని ద్వారా 200 గ్రాముల లోపు వస్తువును వివిధ పట్టణ ప్రాంతాలకు ఆరు గంటల్లో డెలివరీ చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లో లాజిస్టిక్ సేవలను అందించడానికి పది శాతం కమీషన్‌పై ప్రైవేట్ వ్యక్తులను పీసీసీలుగా నియమించారు. వీరి ద్వారా కౌంటర్లను కొనసాగిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నారు.
- వ్యాపారుల కోసం కార్పొరేట్ బల్క్ బిజినెస్ (సీబీబీ) పద్ధతిని కొనసాగిస్తున్నారు. దీని ద్వారా వ్యాపారులతో లాజిస్టిక్ అధికారుల ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. వ్యాపారుల నుంచి వస్తువులను సేకరిచండమే కాకుండా వారు కోరితే డెలివరీ కూడా చేస్తున్నారు. వీరి వద్ద నుంచి నెల వారీగా చార్జీలను తీసుకుంటున్నారు.
- త్వరలో బార్ కోడ్, స్కానింగ్ విధానాన్ని లాజిస్టిక్ సెంటర్లలో అమలు చేయనున్నారు. మొదట జేబీఎస్, కరీంనగర్ కేంద్రాల్లో అమలు చేసేందుకు సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేస్తున్నారు. బార్ స్కానింగ్ విధానంతో వినియోగదారులు పంపించే వస్తువుల చిరునామా, పంపించే వస్తువు సులంభంగా గుర్తించ వచ్చు.

రాముని తలంబ్రాలతో గుర్తింపు

లాజిస్టిక్ ద్వారా భద్రాచలం శ్రీరాముల వారి తలంబ్రాలను అందించడంతో ప్రజల్లో గుర్తింపు వచ్చింది. జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి తలంబ్రాలను ఇంటివద్దనే అందిజేశాం. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులుతో పాటు ప్రతి ఒక్కరూ లాజిస్టిక్ సేవలను అభినందించారు.దీంతో లాజిస్టిక్ వినియోగదారుల సంఖ్య పెరిగింది.పార్సిల్ ను సమయానికి డెలివరీ అందించడం.ఎక్కువ దూరానికి తక్కువ చార్జీలతో వస్తువులను అందించడంతో ప్రైవేట్ కొరియర్ సంస్థలు కూడ లాజిస్టిక్ అశ్రయిస్తున్నారు.రానున్న రోజుల్లో ఆధునీకరణ పద్ధతులతో సేవలను అందిస్తాం.

- రాజు (కరీంనగర్ రీజియన్ ఎగ్జిక్యూటివ్)

ప్రజలు ఆదిరస్తున్నరు

ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ప్రజలు అదిరిస్తున్నరు. వినియోగదారులు పంపిస్తున్న ప్రతి పార్సిల్‌ను భద్రంగా అందజేస్తున్నం. 200 కిలో మీటర్లు లోపు పంపించే వస్తువులను ఆరు గంటల్లో డెలివరీ చేస్తున్నం. వ్యాపార, విద్యాసంస్థలు, మెడికల్ కాలేజీలు, సీడ్స్ సంస్థల నిర్వాహకులను ప్రత్యేకంగా కలుసుకొని వారికి లాజిస్టిక్ సేవలను వివరిస్తున్నం. కరీంనగర్ బస్టాండ్‌లో 24 గంటల సేవలు అందిస్తున్నం. వస్తువులు సెంటర్‌కు చేరుకోగానే వారి సెల్ ఫోన్‌కు సమాచారం చేరుతుంది. దీంతో వినియోదారుడు ఎప్పుడు వచ్చినా డెలివరీ అందిస్తున్నం. త్వరలోనే బార్ కోడ్ స్కానర్ విధానాన్ని అందుబాటులోకి తెస్తం.

- సదాశివ్(అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కరీంనగర్ రీజియన్)



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ఆరు గ్యారెంటీల వాయిదాకే 'ప్రజాపాలన'

- నెల గడుస్తున్నా అందని రైతుబంధు
- మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కార్పొరేషన్, డిసెంబర్ 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలును వాయిదా వేసేందుకే ప్రజాపాలన పేరిట దరఖాస్తుల పక్రియకు తెరలేపిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల వరకు ఈ తంతు నడిపిస్తారని విమర్శించారు. గురువారం కరీంనగర్‌లోని మాజీ మంత్రి కమలాకర్ క్యాంపు ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు నిధులను విడుదల చేస్తే కాంగ్రె స్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి అడ్డుకున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం అధికారం చేపట్టి 20 రోజులు దాటినా ఎం దుకు రైతు బంధు నిధులు ఖాతాల్లో జమ చేయలేదని ప్రశ్నించారు. అలాగే పింఛన్లను కూడా నిలిపివేసిందన్నారు. యా సంగి పంటల సాగు సమయం గడుస్తున్నా రైతుబంధు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో అడ్డగోలుగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, నాయకులు ఆరె రవిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాం

- వార్షిక నేర సమీక్షా సమావేశంలో సీపీ అభిషేక్ మహంతి

రాంనగర్, డిసెంబర్ 28: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం సంతృప్తి కలిగించిందని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి అన్నారు. సిబ్బంది కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. గురువారం కమిషనరేట్‌లో మీడియాకు నేర సమీక్షా వార్షిక నివేదికను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బదిలీల్లో కరీంనగర్ కమినరేట్‌కు వచ్చిన అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ప్రతియేటా పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాల సంఖ్య, మాదక ద్రవ్యాల వినియోగం కూడా పెరుగుతుందని తెలిపారు. వీటి కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2023లో వివిధ నేరాల్లో భాగంగా 5908 కేసులు నమోదు చేశామని తెలిపారు. ప్రజావాణి వచ్చిన 1268 ఫిర్యాదుల్లో 1112 పరిష్కరించామని, డయల్ 100 ద్వారా 43,199 ఫిర్యాదులు రాగా బ్లూకోల్ట్స్ సిబ్బంది ద్వారా స్పందించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల టైంలో 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 4.4 కోట్ల నగదు, 1.89 లక్షల గంజాయి, 19.11 లక్షల విలువైన మద్యం, 8.59 లక్షల విలువైన అభరణాలు, 2.38 లక్షల విలువైన సామగ్రి సీజ్ చేశామని, ఇవన్ని ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పరిష్కరించబడుతాయని తెలిపారు. ఈ యేడు హత్య కేసులు, అత్యాచారాలు, ఫోక్సో కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. షీటీంల ఆధ్వర్యంలో 225 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 1991 కేసులు కోర్టు ద్వారా పరిష్కరించబడగా, 765 కేసుల్లో నిందితులకు శిక్ష పడిందని, 618 కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించామన్నారు.